# వంట యెవరు చెయ్యాలి

శ్రీమతి యస్. సరోజినీ దేవిగారు

మీరు పదేపదే వాణ్ణి అంతగా పోరటం బాగావుండదు. మన మేంచేస్తాం? వింటే చెప్పేవాళ్లమేగాని వినకపోతే వాడి కర్మం అన్నది తమలపాకులు వేసుకుంటూ హనుమాయమ్మ

అల్లా వాడి ఇష్టంవచ్చినట్లుగా తిరగనిచ్చి స్వచ్ఛమైన వంశాన్ని పాడుచెయ్యమన్నావా అన్నాడు శేషయ్యశాస్త్రి.

ఆసమయానికే ఎక్కడనుంచో రామారావు ఇంట్లో అడుగుపెట్టాడు.

మళ్లీ అడిగిచూద్దాం అని రామారావును పిలిచి ఆ అవధాన్లుగారి పిల్లని చేసుకోరా. వాళ్ల వంశం చాలా మంచిది. మనకు fashions ఎందుకు? అన్నాడు శాస్త్రి.

నాన్నగారూ నేను మీతో ఇక పెండ్లి విషయం మాట్లాడను. మీరు ఆవిషయం నాతో మాట్లాడవద్దు. ఇందాకా శేషగిరిరావు మామగారి పిల్లని చేసుకుంటానికి మాట్లాడాను. Settle అయిపోయింది. రేపు పంచమినాడు ముహూర్తం. అల్లా కాకంటారా నేను పెండ్లేచేసుకోను. సన్యాసం పుచ్చుకుంటా అంటూ కాళ్లకి జోళ్లు వేసుకొని యెక్కడికో తొందరగా వెళ్లాడు రామారావు.

హనుమాయమ్మను పిలచి "భవితవ్యతా బలవతీ" రేపు పంచమినాడు వివాహమంట. శేషగిరిరావుగారి పిల్లని చేసుకుంటాడుట. పనిపాటలు మొదలుపెట్టించు. పోనీ మన బరువు వదులుతుంది అన్నాడు శాస్త్రి.

..............................

సరే. కొద్దిరోజులకే కాంత కాపురానికి వచ్చింది. క్రొత్తకోడలు గనుక పనిచేసినా చెయ్యకపోయినా యేమీ అనేది కాదు హనుమాయమ్మ.

ఎన్నాళ్లని కోడల్ని కూర్చోబెట్టి అత్తగారు పనిచేస్తుంది, అందులో ఈకాలంలో?

హనుమాయమ్మ పోరు అంతులేకపోయింది. పని అంటే చాలా అసహ్యం కాంతకు. పాపం యేంచేస్తుంది. ఇక ఇల్లా కాదు వేరింట కాపురంపెట్టించాలి. రామారావు ఏమంటాడో, వచ్చి సరిగా పదినెలలు కాలేదు, అని సందేహిస్తూ కొంతకాలానికి ఏమైనాసరే ఈవిషయం కాపురం చెయ్యటం చాలాకష్టం అనుకొని ఒకరోజున రామారావు గదిలో ఫలహారంచేస్తుంటె దగ్గరకు వెళ్లిందిధైర్యంచేసి. చదువు సంధ్యలు నేర్చిన పిల్ల గాదూ, యేంచెప్పిందో యేమిటో! దొడ్లో భావిదగ్గర బట్టలు వుదుకుతున్న తల్లిదగ్గరకు వెళ్లి, అమ్మా యేమిటే. మీ కోడల్ని తిడుతున్నావుట. అటువంటి Fashions కావాలనేగాదా మీమాట వినకుండా కూడా Marriage చేసుకున్నాను. అప్పుడే వేరింట కాపురంపెట్టపోకే నా కంటూ హనుమాయమ్మ పిలుస్తున్న కొద్దీ వెళ్లిపొయ్యాడు రామారావు.

ఏమండోయి. మన అబ్బాయి సంగతి విన్నారా? మన మాటా పలుకు ఏమీ లేదు. సర్వం కాంతామయం అయి

పోయ్యాడు. ఏమ్మందు పెట్టిందో ఆ మహా తల్లి. ఆ విడను వెనకేసుకొని నాతో కయ్యానికి కాలు దువ్వుతున్నాడు. వేరే కాపురం వుంటాట్ట అని హనుమాయమ్మ శేషయ్యశాస్త్రితో చెప్పింది.

నే నిదివరకే అనుకున్నాను. ఇదంతా ఆపి.....ఎందుకులే, తెలిసి కలియగూడదు, కలిసి తెలియగూడదు అన్నారు అని శాస్త్రి గారంటూంటే, ఇద్దరు పెద్దమనుష్యులతో శేషగిరిరావు వచ్చి, కూర్చోండి భావగారు అనే శాస్త్రిమాట వినిపిచ్చికోకుండ, "పెద్ద వాళ్లైనకొద్దీ కోపము చాదస్తం ఎక్కువైతూవుంటాయి. మీరు పెద్దవారైనారు. మా అమ్మాయిని హనుమాయమ్మగారు వేరేవుండమందిట. శాస్త్రిగారూ మా అల్లుడు భాగంపంచండి. పెద్దమనుష్యులు గూడా ఇక్కడేవున్నా"రంటూ కఠినంగా మాట్లాడాడు. అయ్యా ఆస్తిపంచటాని కెంతవుంది. అబ్బాయినిగూడా రానియ్యండి అన్నాడు శాస్త్రి.........................

అత్తగారిచేతి కొంచెం సాయంచెయ్య లేని కాంత ఒక్కతె ఇంతపనీ చేస్తుందా? యేమిటో వుట్టికెక్కలేనమ్మ స్వర్గానికెక్కుతుందా అన్నట్లు. సరే అన్ని పన్లూ చేసి వండిపెట్టటానికి శేషగిరిరావుగారే ఒక బ్రాహ్మణ్ణి కుదిర్చేడు.

రామారావు బియ్యేగూడా ప్యాసు కాలేదు. అందువల్ల ఉద్యోగం దొరకటం చాలా కష్టంగావుంది. మొత్తంమీద రామారావు ఉద్యోగంలేక రికామిగానేవున్నాడు. పెద్దఆస్తిగలవాళ్లు కారేమో, ఖర్చు భరించ లేక మొఖం తేలేస్తూవచ్చాడు అప్పుడప్పుడు రామారావు. వంటబ్రాహ్మడు. యెంత పదార్థం తెచ్చినా పదిహేనురోజుల్లో అయ్య వారి నట్టిల్లుచేస్తున్నాడు. వాడు కాజేస్తూ న్నాడేమో చూడమని కాంతతో చెపితే, నే క్లబ్బుకి వెళ్లాలని విసుక్కొంటుండేమోనని తానే కొన్నాళ్లు ఆఛార్జీ పుచ్చుకున్నాడు. ఇంటి దొంగని ఈశ్వరుడైనా పట్టలేడని తోచింది. ఆ బ్రాహ్మణ్ణి "యత్తే అగ్నే" చెప్పమన్నాడు. అంత కాంతకు వంటపని వచ్చింది. ఆ పొగలో కూర్చోటం అదీ న్యూసెన్సు అనుకొంది. ఒకరోజున రామారావు యెక్కడికో ప్రయాణం అవుతూంటే నేనుగూడా మావాళ్లింటికెళ్లి రెండు రోజుల్లో వస్తాను అని తానుగూడా ప్రయాణం అయింది.

....... .. ....................

శేషగిరిరావు అల్లుడుకి కొన్నిరోజులైనంతరువాత ఒక వుత్తరం వ్రాశాడు. అందులో సంగతి ఇది. మా అమ్మాయి వంటా అది చెయ్యలేదు. చెయ్యదు. నీకిచ్చి Marriage చెయ్యటం చాలా పొరబాటుఅయింది. అయిందేమో అయింది. వంటచేసేమనిషిని పెడితేనే మీ యింటికివస్తుంది. ఏసంగతి విచారించుకొని వుత్తరం వ్రాయవలసినది.

రామారావు చాలా చిక్కులోపడి పోయ్యాడు. తల్లి దండ్రులను ద్వేషించాడు. వంటబ్రాహ్మణ్ణి పెట్టడానికి డబ్బు

లేదు. ఏమీతోచక నేనే వండిపెడతాను ఉద్యోగందొరకేదాకా అని ఖబురంపాడు. శేషగిరిరావుగారు ఎందుకనో కిక్కురిమిక్కురిమనకుండా ఊరుకున్నాడు. చాలా రోజులు ఒంటరిగానే కాలంగడపేడు. కొంత కాలానికి ఆశవదలుకొన్నాడు. శేషగిరిరావు స్నేహితులుగూడా కాంతను పంపిచ్చట్ట శేషగిరిరావు అని చెప్పారు రామారావుతో. ఏమనుకుందో ఏమిటో కాంత ఒకనాడు అన్నగార్ని తీసుకొని భర్తదగ్గరకు వచ్చింది. రామారావు ఆసమయానికే ఎక్కడికో వెళ్లటానికి ప్రయాణమయ్యాడు. మర్యాదలన్నీ చేశాడు. ప్రొద్దు కూకుతున్నది. ఇద్దరికీ సందేహమే వంట యెవరుచెయ్యాలో!

---

## క్రొత్తకోడలు

కప్పగంతుల సత్యనారాయణగారు

సీ॥ మనసార పేరున మరిమరిఁబిల్చుచు నధికాదరముఁజూపు నత్తయుండ,
'అమ్మాయి' యనిపిల్చి యరుదుగాఁ బనిఁజెప్పి మన్ననలందెడి మామయుండ,
పచ్చిసునాడగాఁ బలుమారురమ్మని వదలక వెంటాడు వదినెయుండ,
అవకాశమాత్రాన నానందమునుఁబొంది, మాటలనుడికించు మరదియుండ,

తే॥ గీ॥ ఎపుడుఁ దనయొద్దనుండంగ నేగుదెమ్మ
టంచుబలుకుచు ప్రేమలు మించునటుల
యక్కునను జేర్చుభర్తయు నమరియుండ
క్రొత్తకోడలి కేదేని కొఱతగలదె!

మ॥ ధనధాన్యంబులు లేకపోయినను బాధన్ జెంది దేమాత్రమున్
పనిపాటల్కడు శ్రద్ధతోనెఱపుచోఁ బాల్మాలికం బొందబో
దనిశంబున్ మసిపాతదాల్చు హృదయంబానంద పూరంబుగా
వనజాతాక్షి దన న్విభుండు కృపయాచేతస్కుడై గాంచినన్.

తే॥ గీ॥ కన్న తల్లిదండ్రులబాయఁ గష్టమనక
తోడఁబుట్టులవీడంగ దుఃఖపడక
భర్తృగృహమున కేగెడు పడతివాంఛ
నాథుప్రేమంబుకన్న నన్యంబుగాదు.